సాక్షి
గుంటూరు

ఆదివారం, 26, జనవరి, 2025



శ్రీవారికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు శనివారం అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.



గాయత్రీ దీప మహాయజ్ఞం

పొన్నూరు: గాయత్రీ పరివార్ పొన్నూరు శాఖ ఆధ్వర్యంలో శనివారం సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 24 దీపాలతో గాయత్రీ దీప మహా యజ్ఞం నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 556.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

జాతీయ సైక్లింగ్ పోటీలకు అర్షతునీసా బేగం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన షేక్ అర్షతునీసా బేగం ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాఖండ్‌లో జరగనున్న జాతీయ సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు నేషనల్ సైక్లిస్ట్ బండ్లమూడి సుబ్బయ్య శనివారం తెలిపారు. ఈ మేరకు సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి తమకు లెటర్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తన కార్యాలయంలో అర్షతునీసా బేగాన్ని అభినందించారని తెలిపారు. పేద కుటుంబంలో పుట్టిన అర్షతునీసా గతంలోనూ జాతీయ స్థాయి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు స్థల పరిశీలన



ప్రత్తిపాడు: మండలంలోని నడింపాలెంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పర్యటించారు. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని 149/4ఏ సర్వే నంబరులో 21.61 ఎకరాల స్థలాన్ని ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు కేటాయించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో సంబంధిత స్థలాన్ని జేసీ పరిశీలించారు. హద్దులు, సర్వే నంబరు మొత్తం విస్తీర్ణం, రోడ్డు, కోర్టు కేసులు, వివాదాలు తదితర విషయాలను తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థలంలో పెద్ద పెద్ద గోతులు ఉండటంతో మైనింగ్ తవ్వకాలపై ఆరా తీశారు. అనంతరం అదే గ్రామంలోని సర్వే నంబరు 110–ఓ2లో ఇటీవల ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణానికి అప్పగించిన 6.35 ఎకరాల భూమిని కూడా జేసీ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు జేసీకి వివరించారు. వెంట మండల సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.

ఆటోనగర్ పరుపుల కంపెనీలో మహిళ మృతి



పెదకాకాని: ఆటోనగర్‌లో పరుపులు, దిండ్లు తయారీ కంపెనీలో మహిళ ప్రమాదవశాత్తూ మరణించిన సంఘటన శనివారం జరిగింది. గుంటూరు ఆటోనగర్‌లోని శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ పరుపుల తయారీ కంపెనీలో రెడ్డిపాలెం ఆదిత్యనగర్‌కు చెందిన కంభంపాటి రమణి పని చేస్తోంది. ఎప్పటి మాదిరిగానే శనివారం వచ్చిన ఆమె మిషన్ వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ అందులో పడింది. పక్కన ఉన్న వారు చూసి మిషన్ ఆపి తీసే సరికే రమణి(26)ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. మృతురాలికి భర్త వెంకటేష్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.టి. నారాయణస్వామి తెలిపారు.

రేపు సీపీఆర్‌పై వర్క్‌షాపు



గుంటూరు మెడికల్: కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్)పై గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు అమెరికాకు చెందిన ప్రముఖ ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ వేమూరి ఎస్. మూర్తి తెలిపారు. వర్క్‌షాపు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమూరి ఎస్. మూర్తి మాట్లాడుతూ గుండె జబ్బుతో ఆకస్మాత్తుగా కుప్పకూలిన వారిని సీపీఆర్(ప్రాణ రక్షణ ప్రక్రియ)తో బతికించవచ్చని చెప్పారు. జీజీహెచ్ ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్య విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధికారాణి మాట్లాడుతూ ఫిజీషియన్స్, రెసిడెంట్స్, మెడికల్ స్టూడెంట్స్, నర్సెస్, సాధారణ ప్రజలు సైతం ఈ వర్క్‌షాపును వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావు, డాక్టర్ అమరేశ్వర్ పాల్గొన్నారు.

మేరా భారత్ మహాన్



ఏర్పాటు చేసిన వేదిక



పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ



మువ్వన్నెల కాంతుల్లో ఎయిమ్స్

గుంటూరు పోలీస్ కవాతు మైదానం గణతంత్ర వేడుకలకు సిద్ధమైంది. అధికారులకు విశాలమైన వేదికను ఏర్పాటు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను నగర ప్రజలు వీక్షించేందుకు గానూ ఏర్పాట్లు చేశారు. పోలీస్ కవాతు రిహార్సల్‌ను జిల్లా ఎస్పీ శనివారం పరిశీలించారు. జాతీయ జెండాను ఎగురవేసే క్రమంలో అను సరించాల్సిన విధులపై చర్చించారు. కలెక్టర్ నాగలక్ష్మి ఏర్పాట్లను పరిశీలించారు. జిల్లాకే తలమానికమైన ఎయిమ్స్ ఆసుపత్రిని మువ్వన్నెల జెండా రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 8 గంటలకు నిర్వహించనున్న జెండా వందనంలో వైద్య విద్యార్థులతో పాటు వివిధ శాఖలకు చెందిన డాక్టర్లు, సిబ్బంది పాల్గొననున్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.

– గుంటూరు వెస్ట్ / తాడేపల్లి రూరల్

రక్త కూటమి రాసిన కక్ష చరిత్ర!

- రషీద్ హత్యకేసుకు కౌంటర్ బ్లాస్ట్‌గా ఆయన సోదరుడిపై అక్రమ కేసు
- రెండున్నరేళ్ల క్రితం బైక్ దహనం అంటూ 3 వారాల క్రితం కేసు నమోదు
- బెయిల్ వచ్చే అవకాశం ఉండటంతో ఇల్లు తగలబెట్టారని సెక్షన్లు మార్పు
- రషీద్ సోదరుడు సహా వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలను జైలుకు పంపిన వైనం
- హత్య కేసులో నిందితులను ఎందుకు అరెస్ట్ చేయలేదని నిలదీత
- బాధిత కుటుంబాన్ని టీడీపీ వేధిస్తోందంటున్న న్యాయవాదులు

నడిరోడ్డుపై రషీద్‌ను హత్య చేయడంతో కుంగిపోయిన అతని కుటుంబానికి న్యాయం చేయకపోగా మరింత కక్షగట్టి మరీ కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. తన 'రక్త' దాహాన్ని తీర్చుకుని కక్ష చరిత్ర రాస్తోంది. ఓ కొడుకును టీడీపీ గూండాలు చంపగా, మరో కుమారుడిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారు. రషీద్ హత్య కేసు నుంచి బయటపడేందుకు అతని సోదరుడిని సంబంధం లేని కేసులో ఇరికించారు.

రషీద్ కుటుంబంపై కొనసాగుతున్న ప్రభుత్వ వేధింపుల పర్వం

సాక్షి, నరసరావుపేట: గతేడాది జూలై 17వ తేదీ రాత్రి పల్నాడు జిల్లా వినుకొండ పట్టణం ముండ్లమూరి బస్టాండ్ వద్ద వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ రషీద్‌ను టీడీపీ రౌడీ షేక్ జిలానీ నడిరోడ్డుపై కిరాతకంగా హత్య చేశాడు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో హత్య చేసిన జిలానీకి సహకరించిన మరో ముగ్గురిని అరెస్ట్ చూపారు. అయితే హత్యలో కీలకంగా ఉన్న జిలానీ సోదరుడు జిమ్ జానీ, ఇతర టీడీపీ నేతలు స్వేచ్ఛగా బయట తిరుగుతున్నారు. వీరిని పోలీసులు అరెస్ట్ చేసే ప్రయత్నం చేయకపోగా.. ఎలాగైనా రషీద్ హత్య కేసు నుంచి బయటపడేసేలా కుట్రలు పన్నుతున్నారు. ఇందులో భాగంగా 2022 జూలై 10వ తేదీన జరిగిన బైక్ దహనం ఘటనపై తాజాగా మూడు వారాల క్రితం కేసు నమోదు చేసి రషీద్ సోదరుడు షేక్ ఖాదర్, ఆ కుటుంబానికి అండగా నిలుస్తున్న వైఎస్సార్‌సీపీకి చెందిన 20 మంది మైనార్టీ నేతలపై అక్రమ కేసు బనాయించి, జైలుకు పంపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేయాలని రషీద్ హత్యకేసులో ఉన్న జిమ్‌జానీ అప్పట్లో కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. అది ఇంకా కోర్టులో పెండింగ్‌లో ఉంది. అయితే రషీద్ మర్డర్ కేసు నుంచి బయటపడాలన్న కుట్రతో కూటమి నేతల ప్రోద్బలంతో తాజాగా మరో సారి పోలీసులకు ఫిర్యాదు చేసి, గత నెల 29వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదు చేయించారు.

రెండున్నరేళ్ల తరువాత ఫిర్యాదు...

గతంలో కోర్టులో వేసిన ఫిర్యాదులో జిమ్ జానీ ఇంటి మీదకు వచ్చి బైక్ తగలబెట్టారు అని రాయగా, కొత్తగా ఇచ్చిన ఫిర్యాదులో ఏకంగా తాను అద్దెకు ఉంటున్న ఇంటినే తగలబెట్టారు అని మార్చి రాశారు. ఇందులో నిందితులకు బెయిల్ రాకూడదన్న కక్షతో మంగళవారం అప్పటికప్పుడు సెక్షన్లను మార్చి పోలీసులు కోర్టులో మెమో దాఖలు చేసినట్టు తెలుస్తోంది. మరోవైపు గతంలో కోర్టులో వేసిన ఫిర్యాదులో 15 మంది నిందితులు పేర్లు చేర్చగా, తాజా ఫిర్యాదులో ఏకంగా 30 మందిపై కేసు నమోదు చేశారు. ఇందులో హత్యకు గురైన రషీద్ సోదరుడు ఖాదర్ బాషా పేరు సైతం చేర్చడం గమనార్హం. పోలీసుల అత్యుత్సాహంతో 2020లో చనిపోయిన సయ్యద్ భాషీ పేరును సైతం 2022లో జరిగిన ఘటనలో ముద్దాయిగా చేర్చారు. ప్రైవేట్ కేసు పెండింగ్‌లో ఉండగా రెండున్నరేళ్ల తరువాత వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్‌గా కేసు నమోదు చేయడమేంటని ప్రజాస్వామ్యవాదులు ప్రశ్నిస్తున్నారు. మైనార్టీలను రాజకీయంగా వైఎస్సార్‌సీపీ వైపు వెళ్లకుండా చేయడంతో పాటు ఎలాగైనా రషీద్ హత్య కేసు నుంచి బయటపడాలన్న కుట్రతోనే ఈ కొత్త కేసులు, సెక్షన్ల మార్పు చేస్తున్నారంటూ వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేతలు వాపోతున్నారు.



రషీద్‌ను నడి రోడ్డుపై కత్తితో నరుకుతున్న టీడీపీకి చెందిన జిలానీ (ఫైల్)

మా ఇంటిని దహనం చేయలేదు



రెండున్నరేళ్ల క్రితం మా ఇంటిని రషీద్, ఆయన సోదరుడు ఖాదర్‌లు తగలబెట్టారని పోలీసులు కేసు నమోదు చేశారట. వాస్తవానికి మా ఇంటిని ఎవరూ తగలబెట్టలేదు. అది పూర్తిగా అవాస్తవం. ఘటన జరిగిందన్న రోజు నేను ఇంటిని పరిశీలించాను. నిజంగా మా ఇంటిని తగలబెట్టి ఉంటే నేనే పోలీసులకు ఫిర్యాదు చేసేదాన్ని. అప్పట్లో అద్దెకు ఉన్న జిమ్ జానీ కుటుంబం చేత నష్టపరిహారమైనా వసూల్ చేసేదాన్ని కదా.

– ఎస్‌కే ఫరీద్‌బీ, ఇంటి యజమానురాలు

● మధ్యవర్తిత్వంతో సత్వర పరిష్కారం



26 జిల్లాల న్యాయవాదులతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి, గుంటూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి

ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గుంటూరు మెడికల్ కళాశాల ఆవరణలోని జింఖానా ఆడిటోరియంలో శనివారం మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు రాష్ట్రస్థాయి అవగాహన సదస్సును హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మధ్యవర్తిత్వం మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు న్యాయవాదులు ఎక్కువ దృష్టిసారించాలని ఆయన సూచించారు. మధ్యవర్తిత్వంలో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయని వివరించారు.

– నగరంపాలెం(గుంటూరు వెస్ట్)

ప్రజాస్వామ్యానికి ఊపిరి ఓటుహక్కు

- జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
- ఘనంగా 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం

గుంటూరు వెస్ట్: ప్రపంచంలోనే అతి పెద్దదైన భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటుహక్కు ఊపిరి వంటిందని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. జిల్లా కలెక్టర్‌తో పాటు, ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, సీనియర్ సిటిజన్స్, ఫ్రీడమ్ ఫైటర్స్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటుహక్కు వినియోగంపై అవగాహన పెంచేందుకు భారత ఎన్నికల సంఘం 2011 నుంచి జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తోందని వివరించారు. 1950 జనవరి 25న ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఏర్పడిందని, ఇప్పటికీ 75 వసంతాలు పూర్తి చేసుకుందని పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు, దివ్యాంగులకు లింగ వివక్ష లేకుండా ఓటుహక్కు కల్పించినట్లు తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి మాట్లాడుతూ పౌరులందరూ ఓటు సద్వినియోగం చేసుకుంటే ఆదర్శవంతమైన ప్రభుత్వాలు వస్తాయని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్, ఫ్రీడమ్ ఫైటర్స్‌ను సత్కరించారు. వక్తృత్వ పోటీలు, వ్యాసరచన, డ్రాయింగ్, స్లోగన్, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కంచర్ల శివరామయ్య, డీఆర్వో షేక్ ఖాజావలి పాల్గొన్నారు.



సీనియర్ సిటిజన్‌లను సత్కరిస్తున్న జిల్లా కలెక్టర్

అధిక వడ్డీ ఆశ చూపి ఐపీ

- దొరికిన కాడికి ప్రజల డబ్బు వసూలు
- నమ్మకంగా ఏళ్ల తరబడి వ్యాపారాలు
- రూ.కోట్లలో చీటీపాటల నిర్వహణ
- రూ.వందల కోట్లు వసూలు చేశాక ఐపీ
- నరసరావుపేటలో కొందరి తీరిది
- కలవరపాటుకు గురవుతున్న బాధితులు

శరీరంపై ఖద్దరు చొక్కా, రెండు చేతులకు వేళ్లనిండా ఉంగరాలు, మెడలో జిగేలుమనిపించే బంగారు చైన్లు, రూ.లక్షలు ఖరీదు చేసే కార్లు, రూ.కోట్ల విలువైన భవనాలు, హడావుడి చేసే వ్యాపారాలు.... ఇవి ఉంటే చాలు బ్యాంకుల కంటే ఇలాంటి వారే భద్రమని నమ్మేస్తున్నారు. బ్యాంకుల్లో వడ్డీల కంటే వీరి వద్దే అధికమని ఆశ పడుతున్నారు. అదిగో ఆ హోదా.. ఇక మన డబ్బులకు అదే ధీమా.. అని రూ.లక్షలకు లక్షలు వారి చేతుల్లో పెట్టేస్తున్నారు. వీరితోపాటు తమ బంధుమిత్రులనూ ఆ బడాబాబుల వలలోకి లాగేస్తున్నారు. ఆ బడాబాబుల వ్యాపారం అడ్డం తిరిగితే ఐపీ అంటూ జెండా ఎత్తేస్తున్నారు. అవసరానికి ఉపయోగపడతాయని రూపాయి రూపాయి కూడబెట్టి అప్పులిచ్చిన వారు అమ్మో అంటూ గుండెలు బాదుకుంటున్నారు.

నరసరావుపేట టౌన్: దేశంలో ఆర్థిక నేరాలను వివిధ రూపాల్లో చూస్తుంటాం. బ్యాంకులకు రుణాలు ఎగనామం పెట్టే వాళ్ల దగ్గర నుంచి చిన్న మొత్తాల్లో చీటీలు వసూలు చేసి జేబులకు చిల్లులు పెట్టే వారు, టెక్నాలజీ సాయంతో సైబర్ మోసాలకు పాల్పడే వారు కనిపిస్తుంటారు. అయితే, నరసరావుపేటలో మాత్రం నమ్మకాన్ని పెట్టుబడిగా పెట్టి నట్టేట ముంచుతున్నారు. గత ఆరు నెలల్లో ఈ తరహా మోసాలు ఒక్కొక్కటిగా బయట పడటంతో అప్పులిచ్చిన వారు గుండెలు బాదుకుంటున్నారు. తాజాగా నరసరావుపేటలో ఇద్దరు బడా వ్యాపారులు ఐపీ పెడుతున్నారనే వార్తలు చక్కర్లు కొట్టడంతో కలకలం రేపింది. దానికి బలం చేకూర్చే విధంగా చిట్‌ఫండ్, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసే బడా వ్యాపారి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి కుటుంబంతో రెండు రోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లాడు. సుమారు రూ.150 కోట్ల వరకు జనం దగ్గర అప్పు, చీటిపాటల రూపంలో వసూల్ చేసినట్టు సమాచారం. అతనికి పట్టణంలో పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలు, విలువైన స్థలాలు ఉండటంతో అప్పు ఇచ్చిన డబ్బులు ఎక్కడికి పోవు అన్న ధీమాతో స్తోమతకు మించి వడ్డీలకు ఇచ్చారు. ప్రతి నెలా సక్రమంగా వడ్డీ చెల్లిస్తుండటంతో బంధువులు, స్నేహితుల వద్ద నుంచి సైతం కొందరు అప్పులు ఇప్పించి వారిని రోడ్డుపైకి తెచ్చారు.

ఆడంబరాలే నమ్మకానికి పునాదులు

నరసరావుపేటలో ఐపీ పెడుతున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు వ్యాపారులు మొదటి నుంచి నమ్మకంగా వ్యవహరించిన వారే. బ్యాంకుల్లో తక్కువ వడ్డీకి నగదు డిపాజిట్ చేసేకంటే తమ వద్ద అయితే ఎక్కువ వడ్డీ వస్తుందనే నమ్మకాన్ని ప్రజల్లో కల్పించారు. ఇద్దరు వ్యాపారుల్లో ఒకరు రియల్ ఎస్టేట్‌తోపాటు పొగాకు వ్యాపారం చేసేవారు. వీటితోపాటు స్థిరాస్తులు ఉండటంతో అతని వద్ద పెట్టుబడులు పెట్టేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా నమ్మకంగా వ్యాపారం కొనసాగించి రూ.కోట్లలో ప్రజల వద్ద నుంచి నగదు వసూలు చేశారు. ప్రస్తుతం ఆయనకు ఆస్తులకంటే అప్పులే అధికంగా ఉన్నాయనే ఉద్దేశంతో ఐపీ పెట్టేందుకు సిద్ధమయ్యారని సమాచారం. ఇది ఇలా ఉండగా సదరు పొగాకు వ్యాపారి బాధితులు వాదన మరోలా ఉంది. అప్పులు తీసుకున్న డబ్బులతో ఇతర ప్రాంతాల్లో విలువైన ఆస్తులను బినామీ పేర్లతో కూడబెట్టుకొని వ్యాపారంలో నష్ట వచ్చిందన్న సాకు చూపుతూ తమకు ఎగ్గొట్టేందుకు కుట్రలు పన్నుతున్నాడని వాపోతున్నారు.

ష్యూరిటీ ఉండాలి ...

సంస్థలు, వ్యక్తుల వద్ద పెట్టుబడులు గానీ, వడ్డీ వ్యాపారాలు గానీ వంటి వ్యవహారాల్లో అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ గుర్తింపు కలిగిన సంస్థల్లోనే పెట్టుబడులు, డిపాజిట్‌లు చేయాలని సూచిస్తున్నారు. అదే సమయంలో వ్యక్తుల వద్ద నగదు భద్రపరచుకునే క్రమంలో వారి నుంచి ష్యూరిటీ తీసుకోవాలంటున్నారు.



అనధికార చిట్టీలు కట్టి మోసపోవద్దు

అనధికార చీటీ పాటలపై నిఘా ఉంచుతాం. రిజిస్ట్రేషన్ కలిగిన చిట్‌ఫండ్‌లలోనే ప్రజలు పొదుపు చేసుకోవడం ఉత్తమం. చిట్‌ఫండ్ మోసాల్లో నష్టపోయిన బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయండి. చట్టపరంగా వారికి న్యాయం జరిగేలా చూస్తాం.

– కె. నాగేశ్వరరావు, నరసరావుపేట డీఎస్పీ

జాబితాలో ఇంకెందరో...?

ఇద్దరు ప్రముఖ వ్యాపారుల ఐపీ పెడుతున్నారన్న ప్రచారం సాగుతున్న నేపథ్యంలో మరో ఔషధ వ్యాపారి కూడా ఇదే బాట పడతారని సమాచారం. కొంతకాలంగా సకాలంలో వడ్డీలు కట్టకపోవడంతో అప్పులిచ్చిన వారి ఒత్తిడి మేరకు ఇటీవల బహుళ అంతస్తుల భవనాన్ని వారికి రాసి ఇచ్చారట. ఇతర రుణదాతలు ఒత్తిడి చేస్తున్నారు. ఆస్తులు అమ్మి డబ్బులు కడతానని హామీ ఇచ్చినట్టు తెలియవచ్చింది. మరోవైపు నరసరావుపేట రూరల్ మండలం దొండపాడు గ్రామానికి చెందిన ఓ గొర్రెల వ్యాపారి రూ.2 కోట్లకు ఐపీ పెట్టడంతో బాధితులు రూరల్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో నరసనరావుపేటలో ఐపీల పరంపర ఆగుతుందా? లేదా? అనే చర్చ జోరుగా వినిపిస్తోంది.

రాజధాని ప్రాంతంలో అక్రమంగా మట్టి తవ్వకాలు

ఐదుగురుని అరెస్టు చేసిన పోలీసులు



తాడేపల్లి రూరల్: రాజధాని పరిధిలోని మంగళగిరి రూరల్ కృష్ణాయపాలెంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న ఐదుగురు వ్యక్తులను మంగళగిరి రూరల్ పోలీసులు శనివారం సాయంత్రం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఎస్ఐ వెంకట్ తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 8న మంగళగిరి రూరల్ రాజధాని గ్రామమైన కిష్టాయపాలెంలో ఈ–8 రహదారిలో గతంలో ప్రభుత్వం గ్రావెల్ రోడ్డు నిర్మించింది. దాన్ని గుర్తు తెలియని వ్యక్తులు జనవరి 8న తవ్వేశారంటూ సంబంధిత అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి సాంకేతిక ఆధారాలతో విస్తృత తనిఖీలు చేపట్టారు. మట్టి తవ్వకాలు నిర్వహించిన సూత్రధారుడు, పాత నేరస్తుడు యర్రబాలేనికి చెందిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించారు. తవ్వకాలు చేసిన వారు తాడేపల్లికి చెందిన ఏసు, మస్తాన్ అని తెలిపాడు. వారిని కూడా విచారించి మట్టి తవ్వకాలు జరిగినట్లు నిర్ధారించినట్లు ఎస్ఐ వెంకట్ తెలిపారు. జేసీబీ, లారీ డ్రైవర్‌ను కూడా అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన వివరించారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,600** గరిష్టం : రూ. **3,400**

మోడల్ ధర రూ. **3,000**

క్లుప్తంగా

నేడు ఉపకార వేతనాల పంపిణీ

తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర



కొరిటిపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు, బలిజ కాపు సంక్షేమ సంఘం–కావలి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 19వ విద్య ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. ఇందులో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 133 మంది పేద విద్యార్థులకు రూ.4.48 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ.2.24 లక్షలు తులసి సీడ్స్‌కు చెందిన కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా, మిగిలిన రూ.2.24 లక్షలు బలిజ కాపు సంక్షేమ సంఘం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న లేక్ వ్యూ హోటల్‌లో మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. ముఖ్య అతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

ఎంపీడీవోల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



మాట్లాడుతున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంపీడీవోలు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెనీ క్రిస్టినా మాట్లాడారు. కొన్నిచోట్ల ప్రోటోకాల్ విషయంలో ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వాటిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జెడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంపీడీవోలపై ఉందని చెప్పారు. మండలస్థాయిలో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వాటిని ఉపేక్షించబోమని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోలు కీలకపాత్ర పోషించాలని, వారే అన్ని చూసుకోవాలని సూచించారు. జెడ్పీ ఆస్తులైన వ్యవసాయ, వాణిజ్య భూములు, అతిథి గృహాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పడవ రేవుల వేలం సకాలంలో నిర్వహించి ఆదాయ వనరులు పెంచుకోవాలని ఆమె సూచించారు. బకాయిల వసూలుకు ఎంపీడీవోలు బాధ్యత తీసుకోవాలని, వనరులు పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ సీఈవో సీహెచ్. కృష్ణ, మూడు జిల్లాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

పాత్రికేయుడు బి.ఎల్.నారాయణకు సాహితీ పురస్కారం

28న తెనాలిలో ప్రదానం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న హకీం జాని, సింగారావు, కృష్ణ తదితరులు



బి.ఎల్.నారాయణ

తెనాలి అర్బన్: కామ్రేడ్ తుమ్మల వెంకట్రామయ్య స్మారక సాహితీ పురస్కారానికి తెనాలికి చెందిన సీనియర్ పాత్రికేయులు బి.ఎల్.నారాయణ ఎంపికైనట్లు అభ్యుదయ రచయితల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెనహర్‌బాబు ప్రకటించారు. తెనాలి గాంధీనగర్‌లో శనివారం ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న సాయంత్రం 5.30 గంటలకు గాంధీనగర్ కవిరాజా పార్కులోని వడ్లమూడి గోపాలకృష్ణయ్య స్మారక సీనియర్ సిటిజన్స్ భవనంలో పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా అఖిల భారత అరసం అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రవాస భారతీయుడు బాబు ఆర్ వడ్లమూడి, అరసం రాష్ట్ర కార్యదర్శి వల్లూరి శివప్రసాద్ పాల్గొంటారని పేర్కొన్నారు. బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని మాట్లాడుతూ బి.ఎల్.నారాయణ మూడున్నర దశాబ్దాలుగా పత్రికా రంగంలో ఉంటూ ఎనలేని సేవలు అందించారని గుర్తుచేశారు. సాక్షి దినపత్రిక తెనాలి ఆర్‌సీ ఇన్‌చార్జిగా ప్రస్తుతం కొనసాగుతూ దివంగత ప్రముఖులపై 'జయహో మన తెనాలి', 'చరితార్థులు' వంటి పుస్తకాలను రచించారని చెప్పారు. ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు వావిలాల గోపాలకృష్ణయ్య, కాళోజీ నారాయణ వంటి ప్రముఖులు అందుకున్న ప్రతిష్టాత్మకమైన గాడిచర్ల హరిసర్వోత్తమరావు పురస్కారాన్ని, రాష్ట్ర ఉత్తమ గ్రామీణ విలేకరి పురస్కారం, నార్ల వెంకటేశ్వరరావు– దేవినేని పురస్కారం, జీఎల్ఎస్ గాంధీ స్మారక అవార్డులు గతంలో అందుకున్నారని పేర్కొన్నారు. ఆయన్ను తుమ్మల స్మారక సాహితీ పురస్కారానికి ఎంపిక చేయడం హర్షణీయమన్నారు. మంగళవారం జరిగే పురస్కార ప్రదానోత్సవంలో అందరూ పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, బొర్రా నరసింహా, ఆకుల శ్రీనివాసరావు, వి.కోటేశ్వరరావు, కె.నాగయ్య పాల్గొన్నారు.

ముగిసిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

రేపటి నుంచి విధుల్లోకి..



మాట్లాడుతున్న బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి

నగరంపాలెం: జిల్లాలోని అన్ని కోర్టులకు ఈనెల 27 నుంచి న్యాయవాదులు హాజరవుతారని గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి తెలిపారు. న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పొన్నూరు పట్టణ పోలీసుల దాడిని నిరసిస్తూ మూడు వారాలకు పైగా జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను విరమించుకున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా కోర్టు ఎదుట శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెల చివరలో న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై జరిగిన దాడిని నిరసిస్తూ రిలే నిరాహార దీక్షలు, మానవహారం, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, న్యాయమూర్తులకు వినతిపత్రాలు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో పొన్నూరు పట్టణ ఎస్ఐ సస్పెన్షన్‌తో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారని తెలిపారు. న్యాయవాదుల ఐక్య ఉద్యమాలతో న్యాయం చేకూరిందని చెప్పారు. భవిష్యత్‌లో న్యాయవాదులపై భౌతిక దాడులు జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్ఏ) అధ్యక్షుడు జి.శాంతకుమార్ మాట్లాడుతూ న్యాయవాదులపై పోలీసులు అకారణంగా దాడులు జరిపితే ఉద్యమాలు చేస్తామని చెప్పారు. ఉద్యమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, ఇతర న్యాయమూర్తులు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ అధ్యక్షుడు కేవీకే సురేష్, న్యాయవాదులు మదిర నాగేశ్వరరావు, బేతాళ ప్రభాకర్, బేతాళ ప్రకాశరావు, జీఎస్ఎల్ రావు, షేక్ అజీజుద్దీన్, సత్యం, షేక్ సుభాని, జిలాని పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం



వేడుకలకు సిద్ధమైన మైదానం

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సందర్శకులకు ఏర్పాటుచేసిన కుర్చీలు

గుంటూరు వెస్ట్: 76వ గణతంత్ర దినోత్సవానికి సర్వం సిద్ధం చేశామని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. ఆమె శనివారం జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, అధికారులతో కలిసి పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉదయం 8 గంటలకల్లా జిల్లా అధికారులు మైదానానికి రావాలని, తొమ్మిది గంటలకు జెండా ఆవిష్కరిస్తామని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులకు అసౌకర్యం కలగకుండా మంచినీటితో పాటు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. సాంస్కృతిక కార్యక్రమాలు శకటాల ప్రదర్శనను ప్రత్యేకంగా రూపొందించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



నగరంపాలెం: పోలీస్ కవాతు మైదానంలో ఈ నెల 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లను శనివారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పరిశీలించారు. పోలీస్ కవాతు రిహార్సల్స్ తిలకించి, వాహనంలో జిల్లా ఎస్పీ కలియతిరిగారు. జాతీయ జెండా ఎగురవేసే క్రమంలో అనుసరించాల్సిన విధులపై చర్చించారు. కవాతులో విధులు నిర్వర్తించే బలగాలకు పలు సూచనలు చేశారు. కవాతు అనంతరం నిర్వర్తించే వివిధ కార్యక్రమాల ఏర్పాట్లపై మాట్లాడారు. పోలీస్ బలగాలు (శాంతి భద్రతల, ట్రాఫిక్, ఏఆర్ విభాగాలు), ఎన్‌సీసీ, స్కౌట్స్ విభాగాల పరేడ్ మార్చింగ్ నిర్వహించారు. పోలీస్ అధికారులు, బలగాలు నిర్వర్తించిన కవాతు, పోలీస్ బ్యాండ్ ప్రదర్శనను పర్యవేక్షించారు. జిల్లా ఏఎస్పీ (ఏఆర్) ఎ.హనుమంతు, డీఎస్పీ ఏడుకొండలరెడ్డి, ఆర్ఐ రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ యాజమాన్యాన్ని వివరణ కోరిన విద్యాశాఖ

పెదకాకాని: విద్యార్థిని చితకబాదిన స్కూల్ యాజమాన్యాన్ని జిల్లా విద్యాశాఖ వివరణ కోరింది. ఐదో తరగతి విద్యార్థిని చితకబాదిన టీచర్ పేరుతో శనివారం సాక్షి పత్రికలో కథనం వెలువడింది.స్పందించిన విద్యాశాఖాధికారి సి.వి. రేణుక మండల విద్యాశాఖాధికారి శంకరరావును విచారణ అధికారిగా నియమించింది. విద్యార్థిని వాతలు పడేలా కొట్టిన టీచర్‌ను స్కూల్ నుంచి తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థి శరీరంపై వాతలు పడేలా కొట్టినందుకు వెంకటకృష్ణాపురం సిద్దార్థ్ స్కూల్ గుర్తింపును ఎందుకు రద్దు చేయకూడదో సంజాయిషీ ఇవ్వాలని కోరారు. విచారణ కొనసాగుతోందని ఎంఈఓ శంకరరాజు తెలిపారు.

జిల్లాలో రౌడీషీటర్లపై కఠిన చర్యలు



నగరంపాలెం: జిల్లాలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే తొలి వంద మంది రౌడీషీటర్లపై కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాలులో శనివారం ద్వితీయ అర్ధ వార్షిక నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ తరచూ నేరాలకు పాల్పడే వారిని నెలలో ఒకసారైనా సంబంధిత పోలీస్‌స్టేషన్, సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో హాజరుపరచాలని చెప్పారు. జిల్లాలోని పోలీస్‌స్టేషన్లల్లో పెండింగ్ కేసులను తగ్గించాలని ఆదేశించారు. నేరస్తులు తప్పించుకునేందుకు వీల్లేకుండా న్యాయస్థానాల్లో సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టి వారికి శిక్షపడేలా చేయాలని చెప్పారు. రోజూ గొడవలు చేసే రౌడీలు, అనుమానితులను గుర్తించి వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. ఉమ్మడి జిల్లాల డెప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఎండీ.బర్కత్ అలీఖాన్ న్యాయపరమైన సలహాలు, సూచనలు అందించారు. పలు కేసుల్లో ముద్దాయిలకు శిక్షలు పడేందుకు కృషి చేసిన ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి కోర్టు ఏపీపీ ఎం.డి.సిరాజుద్దీన్, మాజీ ఎస్‌పీపీ కె.శ్యామలాదేవి, ఏపీపీలు ఎం.శ్రీకాంత్, పల్లపు కృష్ణ, జిల్లా పోలీస్ ఉన్నతాధికారులను సత్కరించి, జ్ఞాపికలను అందించారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జి.వి. రమణమూర్తి (పరిపాలన), ఏ.టి.వి.రవిబాబు (ఎల్‌ఓ), కె.సుప్రజ (క్రైం), హనుమంతు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ బి.సీతారామయ్య, పలువురు పోలీసు అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ద్వితీయ నాటక, నాటిక రచనల పోటీలు

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో రాష్ట్ర స్థాయి ద్వితీయ సాంఘిక నాటక, నాటిక పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. నాటకానికి ప్రథమ బహుమతిని ఆరిశెట్టి శివన్నారాయణ స్మారకంగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిని పరాంకుశం వెంకట భవానీప్రసాద్ (బాబ్జీ) స్మారకంగా రూ.15 వేలు, నాటికకు ప్రథమ బహుమతిని భారతుల రామకృష్ణ స్మారకంగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిని గంధం నాగరాజు స్మారకంగా రూ.10 వేలు బహూకరిస్తామని తెలిపారు. రచనలో ఎన్నుకున్న ఇతివృత్తంపై రచయితకు సంపూర్ణ అవగాహన ఉండాలని, అది రచనలో ప్రతిఫలించాలని తెలిపారు. వర్తమాన సమస్యలు, సమాజంలో అట్టడుగున పడి కనిపించని వర్గాలు, మానవ భావోద్వేగాలు వస్తువుగా ఉన్న రచనలకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. నాటక గమనం ప్రతిక్షణం ఇతివృత్తంతో పెనవేసుకుని ఉండాలని సూచించారు. పాత్రోచితమైన భాషకు, యాసకు ప్రాధాన్యత, భావంలో విస్తృతి, సంభాషణల్లో క్లుప్తతను పాటించాలని తెలిపారు. రచనలను ఏప్రిల్ 16వ తేదీలోగా గోపరాజు విజయ్, ప్రధాన కార్యదర్శి, 3–96/2, పోలవరపువారి వీధి, కొలకలూరు (పోస్టు), తెనాలి మండలం, గుంటూరు జిల్లా –522307 (8309116568)కు పంపాలని కోరారు. వివరాలకు పిన్నమనేని మృత్యుంజయరావు, ముఖ్య సలహాదారును (7794004466) సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

దాచేపల్లి: చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి చెందినట్లు ఎస్ఐ సౌందర్యరాజన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. దాచేపల్లి మండలం ముత్యాలంపాడు గ్రామానికి గుమ్మడి శేఖర్‌రెడ్డి కుమార్తె తేజశ్విని(17) గుంటూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సంక్రాంతి సెలవులకు తల్లిదండ్రుల వద్దకు వచ్చింది. ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో తేజశ్విని పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ విద్యార్థిని శనివారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సౌందర్యరాజన్ తెలిపారు.

ఎంపీడీవోల సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు, సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఎంపీడీవోల సంఘ ఉమ్మడి గుంటూరు జిల్లా అడహక్ (తాత్కాలిక) కమిటీ అధ్యక్షుడిగా గుంటూరు రూరల్ ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో భాగంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా జీవీ సత్యనారాయణ (రాజుపాలెం), పి. బాబూరావు (బాపట్ల), ఆర్‌ఈవీ ఫణికుమార్(మాచర్ల), ఏ. దీప్తి (తెనాలి), ఎన్. నాగలక్ష్మి (నిజాంపట్నం), ఆర్.శ్రీనివాసరావు (పెదకాకాని), పి. సీతారామయ్య (శావల్యాపురం), జి. సమతావాణి (తాడికొండ), ఏ. శ్రీనివాసరావు (దుగ్గిరాల) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించిన పనుల పర్యవేక్షణకు ఎంపీడీవోలను బాధ్యులను చేయడంతో పనిభారం పెరిగిపోతోందని తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి సారించడం సాధ్యం కావడం లేదని, ఫలితంగా మండల పరిపాలనకు ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. ఎంపీడీవోల సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘ కో–కన్వీనర్, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు నూతన సంఘ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

పెదకూరపాడు: రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుసంవర్థక శాఖ సంచాలకులు డాక్టర్ దామోదర్ నాయుడు అన్నారు. పెదకూరపాడులోని పంచాయితీ కార్యాలయం వద్ద శనివారం కొమరాబత్తిన రోజన జ్ఞాపకార్థం నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని దామోదర్‌నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభకు గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు అధ్యక్షత వహించారు. దామోదర్‌నాయుడు మాట్లాడుతూ.. పెదకూరపాడులో నూతన పశువైద్యశాలతో పాటు ల్యాబ్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పాడి రైతులకు సబ్సిడీపై అందుతున్న ప్రయోజనాలను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి ఉత్పత్తి పెంచేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో గొర్రెలు, కోళ్లు, పందులు పెంచేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు అందిస్తామని చెప్పారు. అనంతరం లేగదూడల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ శిబిరంలో ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ మాజీ జనరల్ మేనేజర్ కొమరాబత్తిన లూర్దురాజు, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కాంతారావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నరసింహారావు, ప్రముఖ పారిశ్రామికవేత్త సాదినేని కోటేశ్వరరావు, ఎడి సారథిబాబు, శాస్త్రవేత్త ముత్తరావు, స్థానిక నేతలు ఆర్తిమళ్ల రమేష్, గల్లా బాబురావు, బెల్లంకొండ రామగోపాలరావు, వడ్లమూడి అప్పారావు, గుంపనేని బాష చౌదరి, పాడి రైతులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛతకు చోటివ్వాలి



కొండవీడు కోటపై శుభ్రం చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛత పఖ్వాడా 2025 ఉత్సవాలలో భాగంగా కొండవీడు కోటలో స్వచ్ఛత, ట్రెక్కింగ్ నిర్వహించారు. సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్, గుంటూరు ట్రెక్కింగ్ కింగ్స్, గుంటూరు డెకాథ్లాన్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం శనివారం జరిగింది. ఆయా సంస్థలకు చెందిన అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు. బృందాలుగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతపై చైతన్యం తీసుకువచ్చేందుకు సమష్టి కృషి అన్నారు. కార్యక్రమంలో సీజీఎస్టీ అధికారులు బి.లక్ష్మీనారాయణ, బి.రవికుమార్, గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, ట్రెక్కింగ్ నిర్వాహకుడు పుల్లారావు పాల్గొన్నారు.